## బీఆర్ఎస్ పోరు.. దిగొచ్చిన సర్కారు..

(మొదటిపేజీ తరువాయి)

మండల పార్టీ అధ్యక్షుడు బుగ్గ రాములు ఆధ్వర్యంలో ఎలిమినేడులో, ఉప్పరిగూడలోఆందోళనలు జరిగాయి. రాష్ట్ర ప్రభుత్వం మంగళవా రం రైతు వేదికల్లో నిర్వహించిన సంబురాల్లో భాగంగా శివారు ప్రాంతాల రైతులకూ రైతుభరోసా ఇస్తున్నట్లు ప్రకటించి..ఇబ్రహీంపట్నం, అబ్దుల్లాపూర్‌మెట్, మహేశ్వరంతదితర ప్రాం తాల్లోని రైతుల ఖాతాల్లో పెట్టుబడి సాయం జమ చేయడం ప్రారంభించింది. బుధవారం సాయంత్రంలోగా మిగిలిన రైతులకు రైతు భరోసా అందుతుందని జిల్లా వ్యవసాయాధికారి నర్సింహారావు తెలిపారు.

### 43వేల మందికి రూ.55 కోట్లు..

జిల్లాలోని ఇబ్రహీంపట్నం, అబ్దుల్లాపూర్‌మెట్, బాలాపూర్, మహేశ్వరం, శేరిలింగంపల్లి, రాజేంద్రనగర్, శంకర్‌పల్లి, గండిపేట, శంషాబాద్‌మండలాల్లోని సుమారు 43వేల మంది రైతులు రైతుభరోసాకు అర్హులుగా ప్రభుత్వం గుర్తించింది. వీరందరికీ రూ. 55 కోట్లను రైతుభరోసాగా అందించాలని ప్రభుత్వం ట్రెజరీలకు ఆదేశాలు జారీ చేసింది.

## నేటి నుంచి క్రీడాపోటీలు

సిటీబ్యూరో, జూన్ 24 (నమస్తే తెలంగాణ): జీహెచ్ఎంసీ బీట్ జర్నలిస్టులు, కార్పొరేటర్లు, జీహెచ్ఎంసీ ఉద్యోగులకు బుధవారం నుంచి ఈనెల 30వ తేదీ వరకు క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు స్పోర్ట్స్ విభాగం అడిషనల్ కమిషనర్ యాదగిరిరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ క్రీడా పోటీలను మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్‌వీ కర్ణన్ ప్రారంభిస్తారని ఆయన తెలిపారు. ముగింపు సందర్భంగా పోటీలో గెలుపొందిన వారికి బహుమతులు ప్రదానం చేస్తారన్నారు. చాదర్‌ఘాట్‌లోని విక్టరీ ప్లేగ్రౌండ్‌లో ఉదయం 8 గంటలకు పోటీలు ప్రారంభం అవుతాయని చెప్పారు. కబడ్డీ, వాలీబాల్ ఆటలు ఉదయం 8:30 గంటలకు, ఉదయం 10 గంటలకు నాగోల్‌లోని ఫతుల్లాగూడలోని డీఆర్ఎఫ్ శిక్షణా కేంద్రంలో క్రికెట్ పోటీలు ప్రారంభం అవుతాయని యాదగిరిరావు తెలిపారు.

## ఫుడ్ సేఫ్టీ తనిఖీలు

సిటీబ్యూరో, జూన్ 24 (నమస్తే తెలంగాణ): ప్రజారోగ్యానికి, నాణ్యతకు పెద్దపీట వేయాల్సిన ఆస్పత్రి క్యాంటీన్లు రోగులతో పాటు వారికి సహాయార్థం వచ్చే వారి ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నాయి. జీహెచ్ఎంసీ ఫుడ్ సేఫ్టీ అధికారులు మంగళవారం పలు ప్రైవేట్ దవాఖానాలలో చేపట్టిన తనిఖీల్లో కిచెన్ నిర్వాహకుల భాగోతాలు బయటకొచ్చాయి. 73 దవాఖానాలలో ఏకకాలంలో తనిఖీలు చేపట్టిన అధికారులు అపరిశుభ్ర క్యాంటీన్లు, నిలువ ఉంచిన ఆహార పదార్థాలను గుర్తించారు. ఆహార పదార్థాల తయారీ, వంటగది ప్రాంగణాలను పరిశుభ్రంగా ఉంచాలని హాస్పిటల్ యాజమాన్యాలకు అధికారులు సూచించారు. ఆయా దవాఖానాల నుంచి 14 శాంపిల్స్‌ను సేకరించి నాచారంలోని స్టేట్ ఫుడ్ లాబొరేటరీకి పంపించారు. బల్దియా కమిషనర్ కర్ణన్ ఆదేశాల మేరకు హాస్పిటల్స్‌పై తనిఖీలు కొనసాగుతాయని అధికారులు స్పష్టం చేశారు.

# మేం ఇచ్చిన లిస్టే ఫైనల్ చేయాలి

- ప్రభుత్వ పథకాల వర్తింపులో కాంగ్రెస్ నేతల జోక్యం..!
- తమ పార్టీ కార్యకర్తలను అర్హులుగా చేర్చాలని అధికారులకు హుకుం
- ఇందిరమ్మ ఇళ్లు, రాజీవ్ యువవికాసం సహా అన్ని పథకాల్లో హస్తం నేతల ఒత్తిళ్లు
- అర్హులకు అందని ప్రభుత్వ ఫలాలు..!



మేడ్చల్, జూన్ 24 (నమస్తే తెలంగాణ): ప్రభుత్వ పథకాల వర్తింపులో కాంగ్రెస్ నేతల జోక్యం అధికమైందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కాంగ్రెస్ పార్టీకి చెందిన వారికే పథకాల వర్తింపు చేయాలని అధికారులపై ఒత్తిళ్లు వస్తున్నాయి. దీంతో చేసేది లేక కాంగ్రెస్ నేతలు ఫైనల్ చేసిన లిస్టునే అధికారులు అర్హులుగా చేరుస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. హస్తం పార్టీ ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన ఇందిరమ్మ ఇల్లు పథకం, రేషన్‌కార్డుల జారీ, రాజీవ్ యువ వికాస పథకాలకు ప్రజల నుంచి పెద్ద సంఖ్యలో దరఖాస్తులు వచ్చిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో తాము చెప్పినవారికే పథకాలు వర్తింపచేయాలని హస్తం పార్టీ నేతల ఒత్తిళ్లు అధికమయ్యాయంటూ అధికారుల్లో టాక్ నడుస్తోంది. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా వ్యాప్తంగా ఇందిరమ్మ పథకానికి 1.22 లక్షల దరఖాస్తులు రాగా రేషన్ కార్డుల కోసం 1.42 లక్షల దరఖాస్తులు, రాజీవ్ యువ వికాస పథకానికి 66 వేల దరఖాస్తులు వచ్చాయి. అయితే ఇందిరమ్మ పథకానికి సంబంధించి అర్హుల ఎంపికలో ఇందిరమ్మ కమిటీ సభ్యులదే తుది నిర్ణయం కావడంతో వారు చెప్పిన వారికే ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేసేందుకు అధికారులు నిర్ణయం తీసుకుంటున్నారు. అలాగే తాము సూచించిన వారికే నూతన రేషన్ కార్డులు సైతం జారీచేయాలని కాంగ్రెస్ నేతలు హుకుం జారీ చేస్తున్నట్లు సమాచారం.

### సమీక్షా సమావేశం వాయిదా..

ఈ క్రమంలో మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టరేట్‌లో జిల్లా ఇన్‌చార్జి మంత్రి శ్రీధర్ బాబు బుధవారం నిర్వహించాల్సిన సమీక్షా సమావేశం వాయిదా పడింది. జిల్లాలో వివిధ ప్రభుత్వ పథకాల అమలు తీరుపై అధికారులతో మంత్రి సమీక్ష నిర్వహించనున్నారనే నేపథ్యంలో జిల్లా అధికారులంతా నివేదికలను సిద్ధం చేసి ఉంచారు. కారణాలు తెలియనప్పటికీ సమావేశం వాయిదా పడటం వెనుక పథకాల అమలులో నేతల ఒత్తిళ్లపై అధికారుల నుంచి తీవ్ర వ్యతిరేకత వచ్చే అవకాశం ఉందనే సమాచారం మేరకే మంత్రి సమావేశాన్ని వాయిదా వేశారనే విమర్శలు ఉన్నాయి.

### హస్తం కార్యకర్తలకు అందలం..!

జిల్లాలోని మేడ్చల్ మున్సిపాలిటీకి సంబంధించి ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపునకు సంబంధించి అర్హులను కాదని కాంగ్రెస్ పార్టీకి చెందిన వారి పేర్లను లిస్టులో చేర్చారని ఇటీవల పెద్ద సంఖ్యలో ఫిర్యాదులు అందడంతో.. ఈ విషయమై విచారణ చేస్తామని చెప్పిన అధికారులు తర్వాత ప్రభుత్వ పెద్దల జోక్యంతో లిస్టుపై ఇప్పుడు మౌనం పాటిస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా ఇందిరమ్మ పథకంలో ఇప్పటివరకు ఎంపిక చేసిన 1,479 మంది లబ్ధిదారుల్లో కాంగ్రెస్ పార్టీకి చెందిన కార్యకర్తలకే మెజార్టీ ఇళ్లు మంజూరైనట్లు ఆరోపణలున్నాయి. ఇలా ఇందిరమ్మ పథకం విషయంలోనే కాకుండా రాజీవ్ యువవికాసం, రేషన్ కార్డుల జారీలోనూ అధికార పార్టీ నేతల జోక్యం ఎక్కువైపోయిందనే విమర్శల నేపథ్యంలో ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత వస్తోంది.



సబితారెడ్డికి వినతిపత్రం ఇస్తున్న బీఆర్ఎస్ నాయకులు

## నియోజకవర్గ అభివృద్ధికి కృషి

### ఎమ్మెల్యే సబితారెడ్డి

కందుకూరు, జూన్ 24: నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో నడిపించేందుకు కృషిచేస్తున్నామని ఎమ్మెల్యే సబితారెడ్డి తెలిపారు. మంగళవారం మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ సామ ప్రకాష్ రెడ్డి, బీఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ కార్యదర్శి సామ మహేందర్ రెడ్డి, పార్టీ మండల సోషల్ మీడియా కన్వీనర్ బొక్క దీక్షిత్‌రెడ్డి జిల్లెలగూడలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సబితారెడ్డిని కలిసి కొత్తగూడ గ్రామం, మండల కేంద్రంలో నెలకొన్న సమస్యలపైన వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సబితారెడ్డి మాట్లాడుతూ.. కొత్తగూడ గ్రామ పంచాయతీ పరిధిలో నూతనంగా ఏర్పాటువుతున్న కాలనీల అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. నియోజకవర్గ పరిధిలోని సమస్యలను తన దృష్టికి తీసుకువస్తే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటానన్నారు. అనంతరం బాచుపల్లి గ్రామానికి చెందిన జంగయ్యకు సీఎం రిలీఫ్ ఫండ్ కింద మంజూరైన రూ.33 వేల చెక్కును ఎమ్మెల్యే అందజేశారు. కార్యక్రమంలో గ్రామశాఖ అధ్యక్షుడు దువ్వాసి నర్సింహ, తాజా మాజీ సర్పంచ్ యాలాల శ్రీనివాస్, తాజా మాజీ ఎక్స్ ఎంపీటీసీ సురేష్, బాచుపల్లి గ్రామ యూత్ అధ్యక్షుడు నరేష్, ఉపాధ్యక్షుడు రాజు, ప్రతాప రెడ్డి, రాములు, లక్ష్మయ్య, ఆగమయ్య, నర్సింహ తదితరులు పాల్గొన్నారు.




నగరంలోని మాదాపూర్ హోండా షోరూమ్‌లో మంగళవారం హోండా సిటీ స్పోర్ట్స్ ఎడిషన్ కార్ గ్రాండ్ లాంచ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథి శ్రీమతి ప్రియారెడ్డి, ప్రైడ్ హోండా జనరల్ మేనేజర్ కీర్తికుమార్, అసిస్టెంట్ జనరల్ మేనేజర్ రాఘవేందర్ రావు తదితరులు పాల్గొన్నారు.

## ఈవీలతో ఉద్యోగ భద్రతకు ఢోకాలేదు

### ఉద్యోగులకు ఆర్టీసీ ఎండీ సజ్జనార్ భరోసా



సమావేశంలో మాట్లాడుతున్న సజ్జనార్

చిక్కడపల్లి, జూన్ 24: ఈవీ బస్సులతో టీజీఆర్టీసీ ఉద్యోగుల ఉద్యోగ భద్రతకు ఎలాంటి ఢోకాలేదని.. ఉద్యోగుల సంక్షేమానికి యాజమాన్యం కట్టుబడి ఉందని ఆర్టీసీ ఎండీ సజ్జనార్ భరోసా ఇచ్చారు. మంగళవారం సుందరయ్య విజ్ఞానకేంద్రంలో ఆర్టీసీ బీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం 8వ మహాసభ జరిగింది. అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు ఎస్ తిరుపతయ్య, ఈ నిరంజన్, గ్రేటర్ హైదరాబాద్ జోన్ అధ్యక్షుడు పవన్ కుమార్ గౌడ్ అధ్యక్షతన జరిగిన ఈ మహాసభకు ఎండీ సజ్జనార్, ప్రభుత్వ చీఫ్‌విప్ వీ ఐలయ్య హాజరయ్యారు. ఈ సందర్భంగా సజ్జనార్ మాట్లాడుతూ.. ఆర్టీసీలోకి నూతనంగా 2,800 ఈవీ బస్సులను తీసుకువస్తున్నామని తద్వారా నగరంలో కాలుష్యాన్ని నివారించవచ్చన్నారు. ఆర్టీసీ ఉద్యోగులకు పెండింగ్‌లో ఉన్న డీఏ, ఏరియర్స్ ఇచ్చే కార్యక్రమాన్ని ఇప్పటికే ప్రారంభించామన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్లు కే రమేష్, రేణుక, నాయకులు.. చారి, దుర్గయ్య, స్వరూప, కృష్ణ, భూషణ్, స్వామి, మంగమ్మ, శ్రీనివాస్, పద్మ, నాగేష్ పటేల్ తదితరులు పాల్గొన్నారు.



## రేపటి నుంచి ఆషాఢ మాసం బోనాలు

మెహదీపట్నం, జూన్ 24: తెలంగాణ రాష్ట్రంలో ఆషాఢ మాసం బోనాలు గోల్కొండ కోటపై ఉన్న జగదాంబికా ఎల్లమ్మ మహంకాళి ఆలయంలో గురువారం నుంచి ప్రారంభం కానున్నాయి. గోల్కొండ కోటలో జరిగే మొదటి బోనంతో తెలంగాణ వ్యాప్తంగా ఆషాఢ మాసం బోనాలు ప్రారంభమవుతాయి. లంగర్‌హౌస్‌లో ప్రభుత్వం తరపున అధికారికంగా బోనాల ప్రారంభోత్సవాన్ని నిర్వహిస్తారు. లంగర్‌హౌస్ చౌరస్తాలో ఏర్పాటు చేసే అమ్మవారి రథంలో అమ్మవారికి ప్రభుత్వం తరపున పట్టు వస్త్రాలను సమర్పిస్తారు. గతేడాది మాదిరిగా కాకుండా ఈసారైనా సరైన సౌకర్యాలు కల్పించాలని భక్తులు కోరుతున్నారు. బోనాల ప్రారంభోత్సవానికి భారీ పోలీసు బందోబస్తును ఏర్పాటు చేస్తున్నామని దక్షిణ పశ్చిమ మండలం డీసీపీ చంద్రమోహన్ తెలిపారు. నగరంలో బోనాలు జరిగే తొమ్మిది వారాలపాటు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రత్యేక బలగాలతో బందోబస్తు నిర్వహించనున్నామని తెలిపారు. ప్రజలు పోలీసులకు సహకరించి బోనాలను ప్రశాంతంగా జరుపుకోవాలని ఆయన కోరారు.

## మొహర్రం ఊరేగింపునకు పకడ్బందీ ఏర్పాట్లు

### హైదరాబాద్ సీపీ సీవీ ఆనంద్




సిటీబ్యూరో, జూన్ 24 (నమస్తే తెలంగాణ): జూలై నెలలో నగరంలో నిర్వహించనున్న మొహర్రం ఊరేగింపు ప్రశాంత వాతావరణంలో జరిగేలా అన్ని చర్యలు తీసుకుంటున్నామని హైదరాబాద్ సిటీ పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్ అన్నారు. మంగళవారం సాలార్‌జంగ్ మ్యూజియంలో షియా కమ్యూనిటీ మతపెద్దలు, వివిధ శాఖల అధికారులతో ఆయన సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా సీపీ మాట్లాడుతూ.. మొహర్రం సంతాప ఊరేగింపులో పాల్గొనే ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా తగిన వాహన పార్కింగ్ సదుపాయాలు కల్పించడంతో పాటు ట్రాఫిక్ మళ్లింపు చర్యలు చేపడతామని తెలిపారు. ఊరేగింపునకు సంబంధించి తీసుకోవాల్సిన చర్యలు, సౌకర్యాలపై షియా కమ్యూనిటీ మతపెద్దలతో పాటు అధికారుల నుంచి కమిషనర్ సలహాలు, సూచనలు స్వీకరించారు. ఈ సమావేశానికి సౌత్‌జోన్ డీసీపీ స్నేహ మెహ్రా, ఎమ్మెల్సీ మీర్జా రియాజ్, ఎమ్మెల్యేలు జాఫర్ హుస్సేన్, మీర్‌జుల్ఫేకర్ అలీ, డాక్టర్ మౌలానా నిస్సార్ హుస్సేన్, నజబ్ అలీ షాఖ్, ముస్తఫా అంజుమన్, వక్ఫ్‌బోర్డ్ చైర్మన్ అహ్మతుల్లా తదితరులు పాల్గొన్నారు.

## బాచుపల్లిలో ప్రహరీల కూల్చివేత

దుండిగల్, జూన్ 24: దుండిగల్ మున్సిపాలిటీ పరిధిలోని మల్లంపేట, నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని బాచుపల్లిలోని గేటెడ్ కమ్యూనిటీల ప్రహరీలను మంగళవారం హైడ్రా అధికారులు స్థానిక మున్సిపల్ అధికారులతో కలిసి తొలగించారు. బాచుపల్లిలోని హైరజ్డ్ గేటెడ్ కమ్యూనిటీ,కేవీఆర్ విల్లాలు, మల్లంపేటలోని ప్రణీత్ ఆంటీలియా కమ్యూనిటీలకు సంబంధించిన ప్రహరీలు రోడ్డును ఆక్రమించి గతంలోనే నిర్మించగా.. ఈ విషయమై స్థానికులు పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేశారు. స్పందించిన హైడ్రా అధికారులు ఆ ప్రాంతంలోని అక్రమ ప్రహరీలను కూల్చివేశారు.

## తక్కువ ధరకే బంగారం ఇస్తామంటూ..!

- నకిలీబంగారం ముఠా భారీ స్కెచ్
- నిందితుల్లో ఒకరు పోలీస్ కానిస్టేబుల్
- 18మంది ముఠా సభ్యుల అరెస్ట్
- రూ.43లక్షలు స్వాధీనం
- వివరాలు వెల్లడించిన డీసీపీ రశ్మిపెరుమాల్

సిటీబ్యూరో, జూన్ 24(నమస్తే తెలంగాణ): సికింద్రాబాద్ మోండా మార్కెట్‌లో ఇటీవల జరిగిన దోపిడీ కేసును సౌత్ జోన్ పోలీసులు చాకచక్యంగా ఛేదించి నిందితులను అరెస్ట్ చేశారు. మంగళవారం సికింద్రాబాద్‌లోని సౌత్‌జోన్ డీసీపీ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో సౌత్‌జోన్ డీసీపీ రశ్మిపెరుమాల్ వివరాలను వెల్లడించారు. ఈనెల 18న మోండా మార్కెట్‌లో జ్యువెలరీ షాపు యజమాని హరిరామ్ అనే వ్యక్తిని ఓ నకిలీ బంగారం ముఠా మోసం చేసి దోపిడీకి పాల్పడింది. దోపిడీ ముఠాలో 18మందిని అరెస్ట్ చేయగా నిందితుల్లో కొండాపూర్ 8వ బెటాలియన్‌కు చెందిన కానిస్టేబుల్ కేశవ్ పట్టుబడినట్లు తెలిపారు. మార్కెట్ రేటు కంటే 5శాతం తక్కువ ధరకే బంగారం ఇస్తామంటూ 1కేజీ బంగారం కొనుగోలుకు రాధేశ్యామ్ అనే వ్యక్తి ఒప్పందం కుదుర్చుకున్నాడని, దీనికి నగదు రూపంలోనే డబ్బులు ఇవ్వాలని చెప్పినట్లు తెలిపారు. మొత్తం పదిహేను మంది గ్రూపు అదే రోజు బ్లూసీ హోటల్‌లో సమావేశమై దోపిడీకి సంబంధించిన ప్రణాళికను రచించారని , ఆ తర్వాత హరిరామ్‌కు సంబంధించిన కార్యాలయానికి వెళ్లి అక్కడ క్యాష్ చెక్ చేస్తుండగా నలుగురు వ్యక్తులు వచ్చి అందులో కేశవ్ అనే వ్యక్తి తాను ఎస్‌ఓటీ పోలీసు అంటూ ఐడీ కార్డు చూపించి వారి దగ్గర ఉన్న క్యాష్‌బ్యాగ్, సెల్‌ఫోన్లను తీసుకుని అక్కడి నుంచి వెళ్లిపోయి క్యాష్‌బ్యాగ్‌ను రాంబాబు అనే వ్యక్తికి అప్పగించారు. ఆ తరవాత భాను అనే వ్యక్తి బైక్‌పై వెళ్తున్న రాంబాబును తిరుమలగిరి దగ్గర నలుగురు వ్యక్తులు వెహికల్ సీజర్ టీమ్ పేరుతో వచ్చి భాను తన వెహికల్‌పై ఈఎంఐ బాకీ ఉన్నాడంటూ చెప్పి అతడి దగ్గరున్న బ్యాగు నుంచి డబ్బులు తీసుకుని పరారయ్యారు. మొత్తం ఈ వ్యవహారం ప్రధాన నిందితులు ఇద్దరిని గోవాలో అదుపులోకి తీసుకోగా, కేసుతో సంబంధమున్న మరికొంతమందిని కర్ణాటకలో అరెస్ట్ చేశారు. ఈ కేసులో మొత్తం 28 మంది నిందితులు ఉండగా, 10 మంది పరారీలో ఉన్నట్లు డీసీపీ తెలిపారు.చోరీ చేసిన మొత్తం డబ్బును వివిధ మార్గాల ద్వారా తరలించి పోలీసుల దృష్టిని మళ్లించడానికి నిందితులు ప్రయత్నం చేశారు. సీసీ కెమెరాలు, సెల్‌ఫోన్ సిగ్నల్స్ ఆధారంగా నిందితులను అరెస్ట్ చేశామని, ఇందులో రెండు క్రిమినల్ గ్రూప్స్ భాగస్వామ్యం ఉన్నట్లు తమ విచారణలో తేలిందని, ఇందులో ఒకటి నకిలీ బంగారం టీమ్ కాగా మరొకటి వెహికల్ సీజర్ టీమ్ అని డీసీపీ తెలిపారు. నిందితుల నుంచి రూ.43 లక్షల నగదు, 57.193 గ్రాముల బంగారు ఆభరణాలు, రెండు కార్లు, నాలుగు బైక్‌లు, 23సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

# సమన్వయంతోనే వరద నివారణ చర్యలు

- త్వరలో విధుల్లోకి మాన్సూన్ ఎమర్జెన్సీ బృందాలు
- ట్రాఫిక్ అధికారులతో సమావేశంలో హైడ్రా కమిషనర్ రంగనాథ్




సమావేశంలో మాట్లాడుతున్న రంగనాథ్

సిటీబ్యూరో, జూన్ 24 (నమస్తే తెలంగాణ): ప్రభుత్వ శాఖలన్నీ సమన్వయంతో పనిచేస్తే నగరంలోని రహదారులు నీటమునగకుండా చర్యలు తీసుకునే అవకాశముంటుందని.. ఆ దిశగా అందరూ ముందుకురావాలని హైడ్రా కమిషనర్ రంగనాథ్ కోరారు. మంగళవారం బుద్ధభవన్‌లోని హైడ్రా కార్యాలయంలో హైదరాబాద్‌కు ట్రాఫిక్ పోలీసు ఉన్నతాధికారులతో రంగనాథ్ సమన్వయ సమావేశం నిర్వహించారు. ముందుగా మాన్సూన్‌కి సంబంధించి వరదనీటిలో మునిగే ప్రాంతాలలో తలెత్తుతున్న సమస్యలను అధికారులు వివరించారు. నగరంలోని హైదరాబాద్, రాచకొండ, సైబరాబాద్ కమిషనరేట్ల పరిధిలో మొత్తం 349 ప్రాంతాల్లో వరద ముప్పు ఉందని, వర్షం సమాచారం తెలియగానే ఆయా ప్రాంతాల్లో సంబంధిత శాఖల అధికారులంతా అప్రమత్తంగా ఉండాలని రంగనాథ్ సూచించారు. మరో మూడురోజులలో 51 హైడ్రా డిజాస్టర్ రెస్పాన్స్ బృందాలకు 150 మాన్సూన్ ఎమర్జెన్సీ టీమ్‌లు కూడా తోడవుతాయని.. సర్కిళ్లవారీగా జీహెచ్ఎంసీ సిబ్బందితో కలిసి ఈ బృందాలు పనిచేస్తాయని ఆయన తెలిపారు. ఈ బృందాలకు జలమండలి, ట్రాఫిక్, ఇరిగేషన్, విద్యుత్ శాఖలకు చెందిన సిబ్బంది కూడా తోడయితే నగరానికి వరద ముప్పు చాలావరకు తగ్గించవచ్చని తెలిపారు. ట్రాఫిక్ జాయింట్ సీపీలు గజరావు భూపాల్, జోయల్ డేవిస్, హైడ్రా అడిషనల్ డైరెక్టర్ వీ పాపారావు, హైడ్రా, ట్రాఫిక్ పోలీసు అధికారులు పాల్గొన్నారు.

### కబ్జాలపై ఫిర్యాదు చేయండి..

నగరంలో చెరువులు, నాలాలు కబ్జాకు గురైతే వాటిని పరిరక్షించే దిశగా ప్రజల భాగస్వామ్యాన్ని హైడ్రా కోరుకుంటున్నదని, ఇందులో భాగంగా ఫిర్యాదులను హైడ్రా వాట్సప్ నెంబర్ 87124 06899 కు పంపాలని హైడ్రా అధికారులు కోరారు. తమకు తెలిసిన సమాచారానికి సంబంధించిన ఫోటోలతో పాటు ప్రాంతాలను తెలియజేసే లొకేషన్‌ను షేర్ చేయాలని, కమిషనర్ హైడ్రా పేరుతో ఉన్న ఎక్స్, ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్‌లో కూడా సమాచారం ఇవ్వాలని సూచిస్తూ, హైడ్రా కమిషనర్ రంగనాథ్‌కు 72079 23085 నంబర్ ద్వారా నేరుగా సమాచారం పంపించవచ్చని వారు పేర్కొన్నారు.

## వీఎం హోమ్‌లో ఆంధ్ర ఉపాధ్యాయుల పెత్తనం..!

- అనాథలు కాదంటూ విద్యార్థులకు టీసీ ఇచ్చి పంపిచేస్తున్న వైనం
- పాఠశాల ఎదుట విద్యార్థుల ఆందోళన

ఆర్కే పురం, జూన్ 24: సరూర్‌నగర్‌లోని విక్టోరియా మెమోరియల్ హోమ్ రెసిడెన్షియల్ పాఠశాలలో చదువుతున్న పలువురు విద్యార్థులను తొలగించేందుకు వీఎం హోమ్ ఉపాధ్యాయులు చర్యలు తీసుకుంటున్నారు. ఇందులో ఇప్పటికే కొంతమంది విద్యార్థులకు టీసీ, బోనఫైడ్లను ఇచ్చి పంపించారు. వివరాల్లోకి వెళ్తే సరూర్‌గనర్‌లోని వీఎం హోమ్ రెసిడెన్షియల్ పాఠశాల కేవలం తల్లిదండ్రులు లేని, తల్లి గాని తండ్రి గాని లేని అనాథ పిల్లలకు ఉచితంగా విద్యను అందించే కేంద్రం. ఇక్కడ సుమారు 900 మంది అనాథ విద్యార్థులు 1వ తరగతి నుంచి పదవ తరగతి వరకు చదువుకుంటున్నారు. కాగా ఇందులో కేవలం అనాథ విద్యార్థులకే సీటు కేటాయించి విద్యనందించాలి. కానీ గతంలో పాఠశాల ఉపాధ్యాయులు.. విద్యార్థులు తక్కువగా ఉన్నారని ఇష్టానుసారంగా నిరుపేద విద్యార్థులను చేర్పించుకొని ఇప్పుడు వారికి తల్లిదండ్రులు ఉన్నారని అర్థాంతరంగా పంపిస్తే తమ పిల్లలను ఎక్కడ చదివించాలని విద్యార్థుల బంధువులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడి 11 సంవత్సరాలు కావస్తున్నా వీఎం హోమ్ పాఠశాలలో ఆంధ్ర ఉపాధ్యాయుల పెత్తనం నడుస్తోందని విద్యార్థుల బంధువులు ఆరోపిస్తున్నారు. ఇదే విషయంపై ఎమ్మెల్యే సబితారెడ్డిని కలవగా.. ఎమ్మెల్యే సంబంధిత అధికారులతో మాట్లాడారు. విద్యార్థులకు న్యాయం చేస్తానని తల్లిదండ్రులకు సబితారెడ్డి హామీ ఇచ్చారు.

## మానసిక వేధింపులకు గురిచేస్తున్నాడు

- జిల్లా ఇన్‌చార్జి వెటర్నరీ అధికారి బాబు బేరిపై చర్యలు తీసుకోండి
- వెటర్నరీ డైరెక్టర్‌కు అసిస్టెంట్ సర్జన్లు, అసిస్టెంట్ డైరెక్టర్ల ఫిర్యాదు



వెటర్నరీ డైరెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఉద్యోగులు

సిటీ బ్యూరో, జూన్ 24 (నమస్తే తెలంగాణ): రంగారెడ్డి జిల్లా ఇన్‌చార్జి వెటర్నరీ, యానిమల్ హజ్బెంబరీ అధికారి వేధింపులు తాళలేకపోతున్నామని అసిస్టెంట్ సర్జన్లు, అసిస్టెంట్ డైరెక్టర్లు రోడ్డెక్కారు. వారు మాట్లాడుతూ.. ఇన్‌చార్జి జిల్లా వెటర్నరీ అధికారిగా ఉన్న డాక్టర్ బాబు బేరి తమను తీవ్ర మానసిక వేధింపులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. వ్యక్తిగతంగా వేధించడంతో పాటు బూతులు మాట్లాడుతున్నారని అన్నారు. క్షేత్ర పర్యటనకు వచ్చినప్పుడు తమతో ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని, రైతుల ముందు హేళన చేస్తూ పరువుకు భంగం కలిగిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కులం, వ్యక్తిగత విషయాలను అడుగుతూ వ్యక్తిత్వ హననం చేస్తున్నారని, మహిళలను కించపరుస్తూ, అసభ్యంగా ప్రవర్తిస్తున్నారని ఆరోపించారు. విధులు సక్రమంగా నిర్వర్తించలేకపోతున్నామని వాపోయారు. అతడిపై తక్షణమే చర్యలు తీసుకోవాలని కోరుతూ మంగళవారం రాష్ట్ర వెటర్నరీ, యానిమల్ హజ్బెండరీ డైరెక్టర్‌ను కలిసి ఫిర్యాదు చేశారు.

# లష్కర్ బోనాలకు పకడ్బందీ ఏర్పాట్లు

### మంత్రి పొన్నం ప్రభాకర్

బేగంపేట్, జూన్ 24: సికింద్రాబాద్ ఉజ్జయినీ మహంకాళి అమ్మవారి (లష్కర్) బోనాల జాతరను విజయవంతం చేసేందుకు అందరూ సహకరించాలని మంత్రి పొన్నం ప్రభాకర్ కోరారు. జూలై 13,14వ తేదీల్లో జరుగనున్న బోనాల ఏర్పాట్లకు సంబంధించి మంగళవారం దేవాలయ ప్రాంగణంలో వివిధ శాఖల అధికారులతో మంత్రి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆయా శాఖల ఆధ్వర్యంలో చేపడుతున్న ఏర్పాట్లు అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ.. దేవాలయం చుట్టు పక్కల అవసరమున్న చోట బీటీ రోడ్ల నిర్మాణం చేపట్టాలన్నారు. ఇక్కడ గతంలో పనిచేసి చేసి వెళ్లిపోయిన పోలీస్ ఇన్ స్పెక్టర్లను నియమిస్తే అవగాహన ఉంటుందని పోలీసు అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో దేవాదాయ శాఖ కమిషనర్ వెంకట్రావ్, హైదరాబాద్ జిల్లా కలెక్టర్ హరిచందన, జాయింట్ కమిషనర్ విక్రంసింగ్ మాన్, ట్రాఫిక్ అదనపు కమిషనర్ జోయల్ డేవిస్, డీసీపీ రష్మి పెరుమాల్, డిప్యూటీ మేయర్ మోతె శోభన్ రెడ్డి, మాజీ మంత్రి మర్రి శశిధర్రెడ్డి, జీహెచ్ఎంసీ జోనల్ కమిషనర్ రవికిరణ్, జలమండలి డైరెక్టర్ అమరేందర్‌రెడ్డి, జలమండలి జీఎం వినోద్ కుమార్, మహంకాళి దేవాలయం ఈవో మనోహర్‌రెడ్డి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మంత్రి పొన్నం, చిత్రంలో ఎమ్మెల్యే తలసాని తదితరులు

## శివకుమార్ సేవలు చిరస్మరణీయం

నాంపల్లి క్రిమినల్ కోర్టులు, జూన్ 24 (నమస్తే తెలంగాణ): తెలంగాణ ఉద్యమకారుడు, కేసీఆర్ వీరాభిమానిగా రాష్ట్ర సాధన కోసం పాటుపడిన న్యాయవాది పి.శివకుమార్ మరణం పట్ల మంగళవారం నాంపల్లి కోర్టులో శ్రద్ధాంజలి ఘటించారు. తెలంగాణ రాష్ట్ర విద్యుత్ నియంత్రణ మండలి మాజీ చైర్మన్ తన్నీరు రంగారావుతోపాటు బీఆర్ఎస్ లీగల్ సెల్ సభ్యులు కొంతం గోవర్ధన్‌రెడ్డి, ఉపేందర్, సభ్యులు పాల్గొని సానుభూతి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా తన్నీరు రంగారావు మాట్లాడుతూ.. ఈనెల 22న శివకుమార్ హఠాన్మరణం పొందారని.. ఆయన మృతి న్యాయవాద వృత్తికి తీరని లోటుగా అభివర్ణించారు. రాష్ట్రం ఏర్పడిన తర్వాత తొలి ప్రభుత్వ ప్లీడర్‌గా ప్రభుత్వానికి విశేషంగా సేవలందించారన్నారు. పద్మశాలి సామాజిక వర్గానికి చెందిన ఆయన సిటీ సివిల్ కోర్టులో సీనియర్ న్యాయవాదిగా విధులు నిర్వర్తిస్తున్న సమయంలో ప్రభుత్వ న్యాయవాదిగా బాధ్యతలు అప్పగించినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు కిరణ్‌కుమార్, మాజీ ప్రధాన కార్యదర్శి షావుకారి శ్రీనివాస్, బాల్‌రాజ్‌గౌడ్, సభ్యులు.. జక్కుల లక్ష్మణ్, ఇంద్రకరణ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.




సెయింట్ ఆన్స్ పాఠశాల ఎదుట ధర్నా చేస్తున్న ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, నాయకులు

## అనుమతి లేని పాఠశాల సీజ్

### గుర్తింపును రద్దు చేయాలని ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి ధర్నా

మల్లాపూర్, జూన్ 24 : ఏఎస్ రావు నగర్ డివిజన్ పరిధిలోని కుషాయిగూడ పాత మార్కెట్ వద్ద అనుమతులు లేకుండా నడుపుతున్న సెయింట్ ఆన్స్ స్కూల్ వద్ద ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి విద్యార్థి సంఘం నాయకులు, కార్పొరేటర్లతో కలిసి మంగళవారం ధర్నా చేశారు. సంఘటన స్థలానికి చేరుకున్న ఎంఈఓ బాపిరెడ్డి స్కూల్‌ను సీజ్ చేశారు. ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి తో పాటు కార్పొరేటర్లు స్కూల్ ఎదుట రెండు గంటల పాటు ఆందోళన చేశారు. పోలీసుల జోక్యంతో స్కూల్ లో ఇరువర్గాల మధ్య జరిగిన చర్చలతో తోపాటు జిల్లా విద్యాశాఖ అధికారి విజయకుమారితో ఫోన్ లో మాట్లాడి స్కూల్ సీజ్ చేస్తున్నట్లు ప్రకటించారు. బీఆర్ఎస్ నాయకులు సింగిరెడ్డి సోమశేఖర్ రెడ్డి, కార్పొరేటర్లు శిరీష సోమ శేఖర్ రెడ్డి, పన్నాల దేవేందర్ రెడ్డి , ప్రభుదాస్, సాయి జెన్ శేఖర్, పార్టీ నాయకులు ,కార్యకర్తలు విద్యార్థి సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.